
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
శుక్రవారం 18 ఏప్రిల్ 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 । కనిష్ఠం 23.4

అంగన్‌వాడీలా

» అద్దెభవనాల్లో కేంద్రాల నిర్వహణ
» రేకులషెడ్డు, ఇరుకు గదులతో చిన్నారులకు ఇక్కట్లు
» వేసవి ఉక్కపోతతో తల్లడిల్లుతున్న పిల్లలు



ఉక్కపోతతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అసౌకర్యాల నడుమ అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాల్లో ఇప్పటికే చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, వేసవి కాలం కావడంతో ఉక్కపోతకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చాలాచోట్ల అద్దె భవనాల్లోనే కేంద్రాలు కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రేకులషెడ్డులో కేంద్రాలు ఉండటంతో గదిలో వేడిమికి చిన్నారులు విలవిల్లాడుతున్నారు. ముఖ్యంగా పట్టణాల్లో చెల్లించే అద్దె తక్కువగా ఉండటంతో అన్నిసౌకర్యాలు ఉన్న భవనాలు దొరకడం లేదు. దీంతో చిన్నగదుల్లో పెద్దసంఖ్యలో పిల్లలతో నిర్వహిస్తున్న కేంద్రాల్లో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది.

- వివరాలు 6లో

ఊపందుకున్న ఉపాధి పనులు



భువనగిరి మండలంలో కొనసాగుతున్న ఉపాధి పనులు

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు జిల్లావ్యాప్తంగా ఊపందుకున్నాయి. జిల్లా హైదరాబాద్ నగరానికి చేరువలో ఉన్నప్పటికీ, ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండుటెండల్లోనూ కూలీల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లాలో వ్యవసాయ పనులున్నప్పటికీ జిల్లాలో గత నెలరోజులుగా ఉపాధి పనులు జోరుగా జరుగుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో రోజువారీగా 23,567 మంది కూలీలు పాల్గొంటున్నారు. ఏప్రిల్ నెలాఖరు నుంచి మే నెలాఖరు వరకు రోజువారీగా 35వేల మంది కూలీలు పనులు చేయనున్నారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

» జిల్లాలో 32,33,056 పనిదినాలు లక్ష్యం » ప్రస్తుతం రోజువారీగా 23,567 మందికి పని » కూలీలకు 100 రోజులు పనికల్పిస్తూ సుస్థిర ఆస్తుల కల్పన లక్ష్యం

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదకూలీల కుటుంబాలకు 2025-26లో 100 రోజుల పని కల్పిస్తూ సుస్థిర ఆస్తుల కల్పన, గ్రామీణ పేదల జీవనోపాధుల వనరులను శక్తివంతం చేసేందుకు పనులు ఎంపికచేశారు. ఈ పథకం కింద పలు రకాల పనులు చేపట్టనున్నారు. కూలీలకు తగినట్లు నైపుణ్యంలేని పనులను, గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ, పనులను గుర్తించి బడ్జెట్‌ను రూపొందించారు. జిల్లాలో మొత్తం 17 మండలాలు ఉండగా, 428 గ్రామపంచాయతీలున్నాయి. జిల్లాలో మొత్తం జాబ్‌కార్డులు 1,43,143 ఉండగా, మొత్తం కార్డుల్లో వ్యక్తుల సంఖ్య 2,63,326, యాక్టివ్ జాబ్‌కార్డులు 88,564, యాక్టివ్ వేజ్ సీకర్స్ 1,26,498 మంది ఉన్నారు. 2024-25లో రూ.27.49 లక్షల మేరకు కూలీల బడ్జెట్‌ను రూపొందించగా, ఇప్పటివరకు రూ.29.81లక్షల వరకు చెల్లించారు. ఈ పథకం కింద పనులు చేపట్టేందుకు జిల్లా వ్యాప్తంగా జాబ్‌కార్డులను జారీచేశారు. 32,33,056 పనిదినాలకు కూలీలకు దాదాపు రూ.96,99,16,800 బడ్జెట్‌ను రూపకల్పన చేశారు. అయితే మెటీరియల్ సంబంధించిన నిధులు అదనంగా ఉంటాయి. గ్రామాల్లో గుర్తించిన పనులను చేపట్టేందుకు అవసరమయ్యే నిధులపై అధికారులు గ్రామాల వారీగా ప్రణాళికలు రూపొందించారు. ఉపాధి హామీ పథకం కింద 2025-26 ఆర్థిక సంతవ్సరానికి జిల్లా వ్యాప్తంగా 428 గ్రామపంచాయతీల్లో 32,33,056 పనిదినాలు కల్పించేందుకు ప్రణాళికను రూపొందించారు.

చేపట్టనున్న పనులు

ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనులపై ఇప్పటికే గ్రామాలవారీగా సభలు నిర్వహించి ఎంపికచేశారు. వీటిలో నీటి సంరక్షణ పనులు.. వరుస సరిహద్దు కందకాలు, గాడి తవ్వకం, వంపులతో కూడిన కందకాలు, చతురస్రపు కందకాలు, డొల్ల సరస్సులు, కాలు అడ్డుకట్టలు, గండశిలల కరకట్టలు, సరస్సులు, చెరువులు..

- మిగతా 8వ పేజీలో...

జాబ్‌కార్డులు ఉన్నవారందరికీ పని



మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి కూలీలను ఉపాధి కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రస్తుతం జిల్లాలో 23,567 మంది కూలీలు రోజువారీగా హాజరవుతున్నారు. మేలో మరో 10 వేల మంది అదనంగా హాజరవుతారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే గ్రామాలవారీగా చేపట్టనున్న పనులపై గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో పనులను గుర్తించాం. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో మొత్తం 32,33,056 పనిదినాలు కల్పించి, కూలీలకు దాదాపు రూ.96.99కోట్ల బడ్జెట్‌కు రూపకల్పన చేశాం. ఇప్పటివరకు జిల్లాలో రూ.29లక్షల పనులు చేపట్టాం.

- నాగిరెడ్డి, డీఆర్డీవో

2025-26 సంవత్సరానికి 32,33,056 పనిదినాలు

మండలం	గ్రామపంచాయతీలు	పనిదినాలు
అడ్డగూడూరు	17	1,45,900
ఆలేరు	14	1,01,1600
ఆత్మకూరు(ఎం)	23	1,92,2970
భువనగిరి	34	2,83,050,
బీబీనగర్	34	163305
బొమ్మలరామారం	34	185248
చౌటుప్పల్	26	235791
గుండాల	20	232510
తుర్కపల్లి	31	216538
మోటకొండూరు	18	119696
మోత్కూరు	10	115021
నారాయణపురం	31	262100
భూదాన్‌పోచంపల్లి	22	142550
రాజపేట	23	229572
రామన్నపేట	24	206000
వలిగొండ	37	207125
యాదగిరిగుట్ట	23	194080

భూమిపై రైతుకే సర్వ హక్కులు

● అందుకే భూభారతి చట్టం తెచ్చాం ● ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

ఆత్మకూరు (ఎం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భూమిపై రైతుకే సర్వహక్కులు కల్పించేందుకు భూభారతి చట్టం తెచ్చామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. భూభారతిపై మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును కలెక్టర్ హనుమంతరావుతో కలిసి ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అయిలయ్య మాట్లాడుతూ భూమికి, రైతుకు ఆత్మీయ సంబంధం ఉందని, భూ సమస్యలు పరిష్కారంచేసి, రైతుకు భరోసా కల్పించడానికి సీఎం రేవంత్‌రెడ్డి భూభారతి చట్టాన్ని తెచ్చారని చెప్పారు. గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' అన్నదమ్ములు, కుటుంబసభ్యుల మధ్య చిచ్చు పెట్టిందని, అది కేవలం దోపిడీ దొంగలకు మాత్రమే ఉపయోగపడినట్లు ఆరోపించారు. భూభారతిపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన డీసీసీబీ ఆత్మకూరు(ఎం) నూతన శాఖ(బ్యాంక్)ను ఉమ్మడి జిల్లాల సహకార బ్యాంక్ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. మండలకేంద్రంలో డీసీసీబీ నూతనశాఖను ఏర్పాటు చేసుకోవడం మండల రైతులు, ప్రజలు, వ్యాపారవేత్తలకు మంచి శుభపరిణామమన్నారు. వినియోగదారులు అధిక సంఖ్యలో ఖాతాలు తీసుకొని బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలని ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. అనంతరం మండలకేంద్రంలో కూరెళ్ల అనిల్ ఇంట్లో సన్నబియ్యంతో కలెక్టర్ హనుమంతరావుతో కలిసి భోజనం చేశారు. అనంతరం మండలకేంద్రంతోపాటు కొరటికల్, పల్లెపహాడ్ గ్రామాల్లో కమ్యూనిటీహాల్, సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, డీసీసీబీ వైస్ ఛైర్మన్ దయాకర్‌రెడ్డి, మాజీ ఛైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి రాజారామ్, తహసీల్దార్ వి.లావణ్య, ఎంపీడీవో రాములునాయక్, శేఖర్‌రెడ్డి, బి.నర్సింహ, పి.వినోద పాల్గొన్నారు.



ఆత్మకూరు(ఎం)లో సన్నబియ్యంతో వండిన భోజనం చేస్తున్న విప్ అయిలయ్య, కలెక్టర్ హనుమంతరావు

బీటీరోడ్లు నిర్మించడమే లక్ష్యం

ఆలేరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆలేరు నియోజకవర్గంలో దెబ్బతిన్న బీటీరోడ్లను తొలగించి కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యతతో కూడిన రోడ్ల నిర్మాణాలు చేపడుతుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య చెప్పారు. ఆలేరు మునిసిపల్ పరిధిలో బహదూర్‌పేట నుంచి గొలనుకొండ వరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభించి మాట్లాడారు. రవాణా సౌకర్యం మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వర రాజు, ఎంఏ ఎజాజ్, నాయకులు ఎం.శ్రీకాంత్, వట్టిపల్లి శ్రీనివాస్, అంగడి ఆంజనేయులు, సిద్ధిరాజు కూళ్ల సిద్దులు పాల్గొన్నారు.

తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలి

● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు



రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సామేలు

మోత్కూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని పాలడుగు గ్రామంలో బోరుబావి తవ్వకం పనులను ప్రారంభించి మాట్లాడారు. తాగు నీటి సౌకర్యంకోసం ఏర్పాటు చేయనున్న నీటి శుద్ధి యంత్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన భారత రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పౌరులకు రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను హరిస్తూ, ప్రజల హక్కులను తుంగలోతొక్కి నియంతృత్వ పాలన సాగిస్తోందని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రయోజనాలకోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందంటూ రాజ్యాంగాన్ని పరిరక్షించుకుంటామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో సింగిల్ విండో ఛైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, నాయకులు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, రాచకొండ బాలరాజు, మార్కెట్ డైరెక్టర్లు పన్నాల శ్రీనివాసరెడ్డి, కొంపెల్లి లలిత, మాజీ ఎంపీటీసీలు అంతటి నర్సయ్య, ఆకవరం లక్ష్మణాచారి, మాజీ సర్పంచులు మర్రిపల్లి యాదయ్య, ముక్కామల వీరయ్య, సూదగాని పాండు, ఎడ్ల భగవంతు, బద్దం యాదిరెడ్డి, ముక్కామల గంగుమల్లు తదితరులు పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లిలోని భూదాన్ యజ్ఞస్థూపం

ఓ మాట.. మహోద్యమానికి బాట !

● భూదానోద్యమానికి నాంది పలికిన పోచంపల్లి
● ప్రపంచానికి కలికితురాయిగా మారిన పోచంపల్లి
● నేడు భూదాన్ జయంతి వజ్రోత్సవం

● 7లో..

అసంక్రమిత వ్యాధులను నియంత్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మనోహర్

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మనోహర్

భువనగిరి (కలెక్టరేట్), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అవసరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.మనోహర్ అన్నారు. అసంక్రమిత వ్యాధులు, వడదెబ్బ జాగ్రత్తలు, రేబిస్ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై జిల్లాలోని వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలకు కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. హైపర్ టెన్షన్, మధుమేహ వ్యాధులు అధికంగా ఉప్పు, చక్కెర, అన్నం తినడం ద్వారా వస్తున్నాయని, వాటి నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రైస్‌కు బదులు ప్రత్యామ్నాయ ఆహార పదార్థాలైన చిరుధాన్యాలు, జొన్నరొట్టెలను తీసుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. అన్ని రకాల క్యాన్సర్ వ్యాధులను ముందే గుర్తిస్తే నివారణ సాధ్యమన్నారు. స్త్రీలలో వచ్చే సర్వైకల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్‌ను త్వరగా గుర్తించాలన్నారు. ఆరోగ్య కార్యకర్త నుంచి డాక్టర్ వరకు అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. వేసవి దృష్ట్యా ఆశా కార్యకర్తల వద్ద, అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల్లో రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందని, కుక్కలు, కోతులు, పిల్లులనుంచి తమను తాము ప్రజలు సంరక్షించుకోవాలని, పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ చేయించాలన్నారు. నాన్ కమ్యునికేబుల్ డిసీజెస్ (ఎన్సీడీ) ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుమన్ కళ్యాణ్ మాట్లాడుతూ ప్రజలందరూ అసంక్రమిత వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బీపీ, షుగర్ వాటంతట అవే రావని, మనమే తెచ్చుకుంటున్నామన్నారు.డబ్ల్యుహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ సత్యేంద్రనాథ్, డాక్టర్ అనిల్‌లు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో యశోద, శిల్పిని, ప్రోగ్రాం అధికారులు సాయిశోభ, రామకృష్ణ, వీణ, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

హీమోఫిలియాపై అవగాహన అవసరం

రక్త సంబంధిత వ్యాధులపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో మనోహర్ అన్నారు. ప్రపంచ హీమోఫిలియా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన మాట్లాడారు. రక్తం గడ్డ కట్టకుండా ఉండే అరుదైన అనారోగ్య స్థితినే హీమోఫిలియా అంటారని చెప్పారు. హీమోఫిలియాతో బాధ పడేవారికి జీవితాంతం చికిత్సతోపాటు జాగ్రత్తలు అవసరమన్నారు. కార్యక్రమంలో టీబీ లెప్రసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాయిశోభ పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై ఉద్యమాలు చేయాలి

● బీజేపీ రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న జయశ్రీ

భువనగిరి టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యలపై ప్రజలతో కలిసి కార్యకర్తలు ఉద్యమాలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, పార్టీ జిల్లా సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి జయశ్రీ అన్నారు. గురువారం భువనగిరిలో జరిగిన పార్టీ జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తేనే ఎన్నికల్లో గెలుపు సాధ్యమన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, దేశ సమగ్రత చూపుతున్న శ్రద్ధను ప్రజలకు వివరిస్తూ పార్టీకి మద్దతు కూడగట్టాలన్నారు. స్థానిక సమస్యలపై ప్రజలతో కలిసి ఉద్యమాలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఎప్పటికప్పుడు నిరసనలు తెలపాలన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులు సిద్ధంకావాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్, ఎన్నికల సహ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, చిక్క కృష్ణ, రాష్ట్ర జిల్లా నాయకులు దాసరి మల్లేశం, పాశం భాస్కర్, పోతంశెట్టి రవీందర్, పడాల శ్రీనివాస్, సీఎస్ రెడ్డి, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, చందా మహేందర్‌గుప్తా, కె.అచ్చయ్య పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన అంతం కావాలి

● బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుగు నవీన్ ● ముగిసిన బీఆర్ఎస్వీ పాదయాత్ర



గుట్టకు చేరుకున్న బీఆర్ఎస్వీ పాదయాత్ర

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఓ లక్ష్మీనరసింస్వామి.. రాష్ట్రంలో రాక్షస పాలన అంతమొందించి, తిరిగి కేసీఆర్ సార్ పాలన రావాలని ఆశీర్వదించు అని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుగు నవీన్, రాష్ట్ర కార్యదర్శి నాగారం ప్రశాంత్ వేడుకున్నారు. ఈ నెల 27న వరంగల్ జిల్లాలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కావాలని ఈ నెల 15న వేముల కొండ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి చేపట్టిన పాదయాత్ర గురువారం రాత్రి యాదగిరిగుట్టకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరుగ్యారంటీల అమలు ఏమైందన్నారు. 15నెలలు గడిచినా ఇప్పటివరకు సంక్షేమ పథకాల అమలు జాడలేదన్నారు. నిరుద్యోగ సమస్య తీర్చుతామని, లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి, నిరుద్యోగులను సైతం మోసం చేశారన్నారు. పాదయాత్రలో రాష్ట్ర నాయకుడు వలమల కృష్ణ, బాలెంల అవినాష్, చిప్పలపల్లి మహేందర్, చిప్పలపల్లి నరేందర్, కడారి స్వామి, మందుల కిరణ్, మత్సగిరి, తోట నవీన్‌కుమార్, లింగాల మధు, కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేయాలని బీఆర్ఎస్వై ఆధ్వర్యంలో చేపట్టిన

- మిగతా 8వ పేజీలో...

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ

● సోనియా, రాహుల్‌పై కేసులు సరికాదు ● కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల పేర్లను చార్జీషీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ గురువారం మండలకేంద్రంలో కాంగ్రెస్ నేతలతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి ప్రధాన ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అయిలయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని పార్లమెంట్‌లో పోరాటం చేస్తున్న సోనియాగాంధీ, రాహుల్ గాంధీలకు దేశంలో వస్తున్న ఆదరణచూసి ఓర్వలేక, అక్రమంగా ఈడీ కేసులు పెట్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వై.లక్ష్మారెడ్డి, రాష్ట్రనేత ఎల్లంల సంజీవరెడ్డి, ప్యాక్స్ ఛైర్మన్ శేఖర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు డి.నవ్య, భాస్కర్, కె.నరేందర్, ఎం.సిద్ధులు, నర్సింహాచారి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.



ఆత్మకూరు(ఎం)లో రాస్తారోకోలో పాల్గొన్న విప్ అయిలయ్య, కాంగ్రెస్ నేతలు

అంగన్‌వా'డీలా'

» భానుడి భగభగ.. చిన్నారులు విలవిల » ఉక్కపోతతో తల్లడిల్లుతున్న చిన్నారులు



మిర్యాలగూడలోని గాంధీనగర్‌లో రేకులగదిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

అరకొర సౌకర్యాల నడుమ అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతు న్నాయి. ఇరుకు గదుల్లో అసౌకర్యాల నడమ నిర్వాహకులు కాలం వెళ్ల దీస్తున్నారు. రోజురోజుకు ఎండవేడి మి పెరుగుతుండటంతో చిన్నారులు ఉక్కపోతతో ఇబ్బందిని ఎదుర్కొం టున్నారు. అద్దె చెల్లింపు స్వల్పంగా ఉండటంతో పట్టణాల్లో సౌకర్యాలు ఉండే గదులు లభించడం లేదు. దీంతో చిన్నపాటి గదుల్లోనే కేంద్రాల నిర్వహణ జరుగుతోంది. దీంతో చిన్నారులు ఎండవేడిమికి డీలాపడి పోతున్నారు.

ఆంధ్రజ్యోతి విజిట్

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ అర్బన్)
రోజురోజుకూ ఎండవేడిమికి పెద్దలు తల్లిడిపోతుంటే చిన్నారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే కిశోర బాలబాలికలు ఇరుకు గదుల్లో ఇబ్బందిపడుతున్నారు. పౌష్టికాహార తయారీకోసం గ్యాస్ బండ మంట తోడై గదులు వేడెక్కుతున్నాయి. ఈ పరిస్థితి ప్రధానంగా అద్దెభవనాల్లో కొనసాగుతున్న కేంద్రాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. మౌలిక సదుపాయాల కల్పనలో ప్రజా ప్రతినిధులు, పాలకులు శీతకన్ను ప్రదర్శిస్తున్న నేపథ్యంలో చిన్నారులకు అగచాట్లు తప్పడంలేదు. గదుల్లో ఫ్యాన్లు సరిగ్గా పనిచేయడంలేదు. గాలి, వెలుతురు కరువయ్యాయి.

ఒక్క వేములపల్లి మండలంలోనే పక్కాగా...

మిర్యాలగూడ ప్రాజెక్టుపరిధిలో 462అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. మిర్యాలగూడ, మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టుల పరిధిలో 119 కేంద్రాలు మాత్రమే పక్కా భవనాల్లో కొనసాగుతుండగా, 189కేంద్రాలను అద్దెభవనాల్లో నడిపిస్తున్నారు. మరో 154కేంద్రాలు ఉచిత భవనాల్లో పనిచేస్తున్నాయి. మిర్యాలగూడ ప్రాజెక్టు పరిధిలోని వేములపల్లి మండలంలో పూర్తిస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలు పక్కా భవనాల్లో కొనసాగుతున్నాయి. మాడ్గులపల్లి, దామరచర్ల, మిర్యాలగూడ రూరల్, అర్బన్, అడవిదేవులపల్లి, త్రిపురారం మండలాల పరిధిలో అద్దె భవనాల్లో కేంద్రాలు పనిచేస్తున్నాయి. కొన్ని కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో చీకటిగదుల్లో తీవ్ర అసౌకర్య పరిస్థితుల నడుమ చిన్నారులు కాలం వెళ్లదీస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు 14,587మంది కిశోర బాలబాలికలు పూర్వవిద్యాభ్యాసం చేస్తుండగా సిబ్బంది కొరత వెంటాడుతోంది. ప్రాజెక్టు పరిధిలో 176 పోస్టులు ఖాళీగాఉన్నాయి. అందులో 26 కేంద్రాల్లో టీచర్ల కొరత ఉండగా, 150 ఆయా పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. సిబ్బంది కొరత కారణంగా చిన్నారుల ఆలనాపాలన గాడి తప్పి అస్తవ్యస్తంగా తయారవుతోంది. సిబ్బంది కొరత ఏర్పడిన కేంద్రాలను సమీప కేంద్రాల్లో విలీనం చేయడంతో చిన్నారుల సంఖ్య పెరిగి గదులు ఇరుకగా మారుతున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం



మిర్యాలగూడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కొరతపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. పక్కాభవనాల కోసం అవసరమయ్యే నిధుల కోసం ప్రతిపాదనలను గతంలో అందజేసి, నిధుల మంజూరుకు ఎదురుచూస్తున్నాం. పౌష్టికాహారాన్ని పూర్తిస్థాయిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తున్నాం. కరెంటు సదుపాయంలేని కేంద్రాలకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి కరెంట్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తాం.
- చంద్రకళ (సీడీపీవో, మిర్యాలగూడ)

సూర్యాపేట జిల్లాలోనూ..

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)
సూర్యాపేట జిల్లాలో మొత్తం 1,209 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అందులో 347 కేంద్రాల్లో అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. ఇరుకు గదులు, అసౌకర్యాల మధ్య కేంద్రాల్లో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవికాలం కావడంతో చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఐసీడీఎస్ పరిధిలోని కేంద్రాల్లో 43,962 మంది చిన్నారులు వస్తున్నారు. గర్భిణులు 5,799, బాలింతలు 5,005 మందికి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు.

నకిరేకల్ నియోజకవర్గంలో..

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)
అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫ్యాన్లు ఉన్నా కొన్నిచోట్ల మరమ్మతులకు గురయ్యాయి. ముఖ్యంగా అద్దె భవనాల్లో కొనసాగిస్తున్న కేంద్రాల్లో అరకొర వసతులు మధ్య నిర్వహణ కొనసాగుతోంది. మినీ అంగన్‌వాడీలను ప్రభుత్వం గతేడాది అంగన్‌వాడీలుగా గుర్తించింది. అయితే మినీ అంగన్‌వాడీలుగా కొనసాగిన భవనాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలుగా నిర్వహిస్తున్నారు. వీటిలో చాలావరకు గ్రామీణ ప్రాంతాల్లోని రేకుల గదుల్లో కొనసాగుతుండటంతో వేసవి తాపానికి చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో 317 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, వీటిలో 89 కేంద్రాలకే సొంత భవనాలున్నాయి. 163 కేంద్రాలను పలు ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల భవనాల్లో ఉచిత అద్దె కింద నిర్వహిస్తున్నారు. మిగతా 65 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. నియోజకవర్గవ్యాప్తంగా గర్భిణులు 1,564 మంది, 1,335 మంది బాలింతలు ఉన్నారు. ఆయా కేంద్రాల్లో 6నెలల వయసు లోపు చిన్నారులు 1,280, ఏడాది వయసులోపున్న చిన్నారులు 1,326, మూడేళ్ల వయసున్న పిల్లలు 6,950, ఆరేళ్ల లోపు చిన్నారులు 5,032 మంది ఉన్నట్లు తెలుస్తోంది.


చిట్యాలలోని అంగన్‌వాడీ కేంద్రం

ఉక్కపోతలోనే...

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)
దేవరకొండ డివిజన్‌లో అంగన్‌వాడీ కేంద్రాలు కొన్ని పక్కా భవనాల్లో, మరికొన్ని అద్దె భవనాలలో, రేకులషెడ్డులలో కొనసాగుతున్నాయి. రేకులషెడ్డులో ఎండవేడిమికి చిన్నారులు ఉక్కపోతకు గురై ఇబ్బందులుపడుతున్నారు. కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని ఆరు కేంద్రాలు అద్దె భవనంలోనే కొనసాగుతున్నాయి. దేవరకొండ రోడ్డులోని 2వ అంగన్‌వాడీ కేంద్రంలో 14 మంది చిన్నారులతో రేకులషెడ్డులో కేంద్రం కొనసాగుతోంది. వేసవికాలం కావడంతో ఉక్కపోతతో చిన్నారులు ఇబ్బందిపడుతున్నారు. దేవరకొండ ఐసీడీఎస్ పరిధిలో 284 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో 5,985 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు.


కొండమల్లేపల్లిలో రేకులషెడ్డు అద్దె భవనంలో కొనసాగుతున్న 2వ అంగన్‌వాడీ కేంద్రం

అసౌకర్యాల నడుమ


చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న అంగన్‌వాడీ టీచర్ భాగ్య

(ఆంధ్రజ్యోతి-భువనగిరిరూరల్): యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహిస్తున్నా మరికొన్ని నిర్వాహకుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. పలుచోట్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. భువనగిరి, యాదగిరిగుట్ట, ఆలేరు, చౌటుప్పల్, పోచంపల్లి మోత్కూరు మునిసిపాలిటీలలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అందజేసే అద్దె నెలకు రూ.2 వేల నుంచి రూ.4 వేలు యజమానులు గిట్టుబాటు కాక అద్దెకు ఇచ్చేందుకు వెనుకాడుతున్నారు. దీనికితోడు 4 నెలల నుంచి 6నెలలకు ఒకసారి అద్దెచెల్లింపులు జరుగుతుండటంతో అద్దెకు ఇచ్చేందుకు ఇష్టపడటం లేదు. వెరసి దొరికిన ఇరుకు గదుల్లోనే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కొనసాగుతోంది. ఈ విషయమై ఐసీడీఎస్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లినా ఫలితం లేదు.

నిబంధనల మేరకు అద్దె చెల్లింపు



ప్రభుత్వ నిబంధనల మేరకు మునిసిపాలిటీ పరిధిలో రూ.2 వేల నుంచి రూ.4వేల వరకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1000 అద్దె చెల్లిస్తున్నాం. పట్టణాల్లో తక్కువ అద్దెకు ఇల్లు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. అయినప్పటికీ అర్బన్ ప్రాంతాల్లో అన్నివసతులతో కేంద్రాల నిర్వహణ చేపడుతున్నాం. వారంలో ఒకసారి తనిఖీలు చేపడుతున్నాం. పౌష్టికాహారం పంపిణీ, విధుల నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీస్తున్నాం. పిల్లల తల్లిదండ్రులతో కూడా కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం.
- శైలజ , సీడీపీవో భువనగిరి ప్రాజెక్టు

యాదాద్రి జిల్లాలో ..

ఐసీడీఎస్ పరిధిలోని ప్రాజెక్టులు : భువనగిరి, రామన్నపేట, మోత్కూరు, ఆలేరు.
ఎన్ని కేంద్రాలు : 901
సొంత భవనాలు ఎన్ని : 269
అద్దె భవనాలు ఎన్ని : 328
రెంట్ ఫ్రీ భవనాలు:304 (కమ్యూనిటీ హాల్స్‌స్కూల్‌బిల్డింగ్స్, ఓల్డ్ జీపీ భవనాలు)
పట్టణ ప్రాంతాల్లో చెల్లిస్తున్న నెలసరి అద్దె : రూ.2 వేల నుంచి రూ.4వేలు
గ్రామీణ ప్రాంతాల్లో అద్దె : రూ.1000
ఆయా కేంద్రాల్లో 6నెలల్లోపు చిన్నారులు : 4,145
6 నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు : 21,138
3నుంచి 6 ఏళ్లలోపు వారు : 12,181
గర్భిణులు : 3,742
బాలింతలు : 4,145

కిమ్స్‌లో గ్రహణం మొర్రికి ఉచిత శస్త్రచికిత్సలు



గ్రహణం మొర్రి ఉచిత శస్త్రచికిత్సల క్లాప్ కార్యక్రమ వివరాలు చెబుతున్న ప్రిన్సిపాల్ మహేశ్

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గ్రహణం మొర్రికి తమ ఆసుపత్రిలో ఉచితంగా అత్యాధునిక శస్త్రచికిత్సలు చేయనున్నట్లు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలోని కామినేని దంత వైద్య, విద్య కళాశాల ప్రిన్సిపాల్ పీ.మహేశ్, మార్కెటింగ్ విభాగాధిపతి సత్యనారాయణ తెలిపారు. క్లాప్స్(క్లిఫ్ట్ లిప్ అండ్ పాలెట్ సర్జరీస్) పేరిట ఉచిత వైద్యంతో పాటు ఔషధాలు అందజేస్తామన్నారు. గురువారం కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతీ 10వేల మంది జననాలలో ఇద్దరు లేదా ముగ్గురు గ్రహణం మొర్రి బారిన పడుతుంటే మన దేశంలో ప్రతీ 10వేల మంది జననాలలో 8 మంది గ్రహణం మొర్రి బాధితులున్నారని తెలిపారు. వవీరికి మూడు దశల్లో ఆపరేషన్లను చేయవచ్చని, కానీ ప్రాథమిక దశలోనే గుర్తించి శస్త్రచికిత్సలు చేయిస్తే ఆరోగ్యపరంగా మంచి ఫలితాలుంటాయన్నారు. మోతాదుకు మించి మద్యం సేవించడం, పొగ త్రాగే తండ్రుల ద్వారా బీ ఫొలేట్ లోపంతో గ్రహణం మొర్రి రావటానికి అవకాశముంటుందని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ సమస్యకు చికిత్స చేయించుకోవాలంటే గరిష్ఠంగా రూ.50,000లు అవుతాయని కానీ తమ ఆసుపత్రిలో నిపుణులైన వైద్యులతో ఉచితంగా చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్ హెచ్‌వోడీ యశ్వంత్‌సాయి, పీఆర్‌వో కిరణ్ తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్ కోర్టు ఏజీపీగా రేణుకాదేవి


రేణుకాదేవి

హుజూర్‌నగర్ , ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని రెండవ అదనపు జిల్లా కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పట్టణానికి చెందిన శ్రీనివాసుల రేణుకాదేవి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ప్రస్తుతం ఆమె సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా కొనసాగుతున్నారు. ఇక నుంచి రెండవ అదనపు జిల్లా కోర్టుకు కూడా ఏజీపీగా విధులు నిర్వహించనున్నారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకూ ఆమె విధులు నిర్వహించాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆమె నియామకంపై న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, నారపరాజు శ్రీనివాసరావు, కాలువ శ్రీనివాసరావు, జక్కుల నాగేశ్వరరావు, నట్టి సత్యనారాయణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



నల్లగొండలో గురువారం ఉదయం లేతబంగారు వర్ణంలోని సూర్యుడితో పసుపువర్ణమైన ఆకాశం

హారికను ఆదుకుంటాం

● వైద్యసేవలు, ప్రభుత్వసాయంపై పరిశీలించండి
● ట్విట్టర్ వేదికగా అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో రెండేళ్ల కిందట పిచ్చికుక్కల దాడిలో గాయపడి అచేతనస్థితికి చేరిన బాలిక హారికను ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మంత్రి దామోదర రాజనర్సింహ ద్వారా బాలిక విషయం తెలుసుకున్న సీఎం గురువారం హారికకు వైద్యసేవలు అందించడంతో పాటు ప్రభుత్వపరంగా అన్నివిధాలా ఆదుకోవాలని ట్విట్టర్(ఎక్స్) వేదికగా అధికారులను ఆదేశించారు. చిన్నారి తాత కొమ్ము రాందాసు, తల్లి సిద్వంతి తెలిపిన వివరాల ప్రకారం సిద్వంతి భర్త రెండున్నర ఏళ్ల కిందట మృతి చెందడంతో ఇద్దరు కుమార్తెలతో కలిసి సాగర్‌లో తల్లిగారింట్లోనే ఉంటోంది. రెండేళ్ల క్రితం చిన్నకుమార్తె హారిక(7) ఇంటి ముందు ఆటుకుంటుండగా పిచ్చికుక్కలు దాడిచేశాయి. రోడ్డుపై కొంతదూరం లాక్కెళ్లాయి. చిన్నారిని వెంటనే స్థానిక కమలానెహ్రూ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా రెండు డోసుల కుక్కకాటు ఇంజక్షన్లు వేశారు. మూడో డోసు వేసే సమయంలో తీవ్ర జ్వరంతో ఆ చిన్నారి బాధపడుతోంది. జ్వరం ఎంతకి తగ్గకపోవడంతో హారికను హైదరాబాద్ ఫీవర్ ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతుండగానే కాళ్లు, చేతులు స్పర్శను కోల్పోయాయి. దీంతో అక్కడి నుంచి నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా కోమాలోకి వెళ్లింది. 18 నెలల పాటు కోమాలో ఉన్న హారికను నల్లగొండ, హైదరాబాద్‌లోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో దాతల సహకారంతో వైద్యం చేయించారు. దీంతో కోమాలో నుంచి బయటకువచ్చింది. కానీ మాటలు రావడం లేదని తల్లి సిద్వంతి తెలిపింది. అమ్మా అని కూడా పిలవలేని స్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో తన కుమార్తెను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వివిధ దినపత్రికల ద్వారా వేడుకుంది. పత్రికల కథనాల ద్వారా విషయం మంత్రి దామోదార రాజనర్సింహ దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన స్పందించి చిన్నారికి మెరుగైన వైద్యం అందిచాలని నిమ్స్ డైరెక్టర్ బీరప్పను ఆదేశించారు. అంతే కాకుండా నల్లగొండ జిల్లా కలెక్టర్‌కు చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని సూచించారు. దీంతో బుధవారం మునిసిపల్ సిబ్బంది చిన్నారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై నివేదిక తయారుచేసి వైద్య, ఆరోగ్య శాఖకు పంపించారు. హారిక పరిస్థితిని మంత్రి సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన హారిక పరిస్థితిపై ఆరా తీశారు. అంతే కాకుండా బాలికకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాల్సిందిగా అధికారులను సీఎం గురువారం ట్విట్టర్ వేదికగా ఆదేశించారు.


చిన్నారి వివరాలను సేకరిస్తున్న ఆరోగ్య మిత్ర, ట్విట్టర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ట్విట్

Revanth Reddy
@revanth_anumula
చిన్నారి హారిక ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీయడం జరిగింది.

నా ఆదేశాల మేరకు ...
చిన్నారి తాత కొమ్ము రాందాసు గారితో మా అధికారులు స్వయంగా మాట్లాడారు.

హారికకు మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

ఆ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాల్సిందిగా అధికారులను ఆదేశించడం జరిగింది.

సీఎంకు రుణపడి ఉంటాం

మా పాపకు మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు, తమ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి ట్విట్టర్‌లో తెలిపారు. ఇందుకు సీఎంకు రుణపడి ఉంటాం.
సిద్వంతి, చిన్నారి తల్లి

నేడు నిమ్స్‌కు తీసుకెళ్తాం

నేడు(శుక్రవారం) హారికను హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్తాం. మంత్రి రాజనర్సింహ ఆదేశాలతో హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నాం. ఇంటికి వచ్చిన ఆరోగ్యమిత్రకు చిన్నారికి ఆరోగ్యశ్రీ కార్డు కూడా లేదని తెలిపాం.
రాందాసు, హారిక తాత

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	515
టీఎంసీలు	140.3150
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	1,350 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	1,350 క్యూసెక్కులు

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	34.10 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	500 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	4000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	627.30 అడుగులు
టీఎంసీలు	1.07
కాల్వలకు విడుదల	నిల్
ఇన్‌ఫ్లో	313.77 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	58.67 క్యూసెక్కులు

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో గురువారం నిత్యకైంకర్యాలు పాంచరాత్రగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విష్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతకపఠనంతో హోమ పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చక స్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.13,20,094 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనృసింహుడి క్షేత్రంలో గురువారం నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా ఆలయ సంప్రదాయ ప్రకారం అర్చిత కైంకర్యాలు జరిగాయి. కల్యాణం అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం నిర్వహించారు. అనంతరం దేవతమూర్తులను ఆలయ ప్రవేశం చేయించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు కొనసాగాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు, ఉద్యోగుల పాల్గొన్నారు.


ప్రాకార మండపంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

శిలువపై క్రీస్తు శాంతి సందేశం

నేడు గుడ్ ఫ్రైడే

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ కల్చరల్)
ఏసుక్రీస్తును శిలువ వేసిన రోజును క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేగా నిర్వహిస్తారు. తిరిగి లేచిన మూడో రోజున ఈస్టర్ పండుగను జరుపుతారు. క్రైస్తవులకు ఇది అతి ముఖ్యమైన పండుగ. ఈ ఏడాది మార్చి 8వ తేదీ నుంచి మొదలుకుని ఈ నెల 18వ తేదీ వరకు 40 రోజుల పాటు క్రైస్తవులు ఉపవాస దీక్షలు చేపట్టారు. గుడ్ ఫ్రైడే రోజు వరకు క్రైస్తవులు ఉపవాసాలు ఉండి భక్తిశ్రద్ధలతో ప్రతి రోజూ దైవ ప్రార్థనలు చేస్తారు. ఏసుక్రీస్తు జననం, మరణం, పునరుత్థానం ఘటనలు అసాధరణంగా వారు భావిస్తారు. ఏసుక్రీస్తు శిలువపై పడిన కష్టాలు, పలికిన ఏడు మాటలు ప్రపంచ మానవాళికి ప్రేమ మార్గాన్ని చూపుతాయని భక్తుల విశ్వాసం.

అందువల్ల ఆయన చనిపోయిన రోజును ప్రపంచవ్యాప్తంగా మంచి శుక్రవారం(గుడ్‌ఫ్రైడే)గా జరుపుకుంటారు. ఈ నెల 18వ తేదీన నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న చర్చిల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు జరగనున్నాయి. అందుకు చర్చీలు ముస్తాబయ్యాయి.



పులిచింతలలో జలవిద్యుత్

పునఃప్రారంభం



మేళ్లచెర్వు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట ఉభయరాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టులో గురువారం జలవిద్యుదుత్పత్తి ప్రారంభమైంది. ప్రాజెక్టు దిగువ భాగాన నీటి అవసరాల కోసం తెలంగాణ పవర్ హౌస్ నుంచి 4 వేల క్యూసెక్కులను వినియోగిస్తూ ఒక్క యూనిట్ ద్వారా 26 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 (45.77 క్యూసెక్కులు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 166.89 (34.10టీఎంసీలు) అడుగులుగా నమోదైంది. ప్రాజెక్టుకు 500 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా, విద్యుదుత్పత్తి కేంద్రం నుంచి 4 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు గేట్లు మూసివేసి ఉంచారు.

నిజాయితీ చాటుకున్న డ్రైవర్

వలిగొండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుడు పోగొట్టుకున్న 25 తులాల బంగారం బ్యాగ్‌ను బాధితుడికి అప్పగించి ఓ ప్రైవేట్ డ్రైవర్. నిజాయితీని చాటుకున్నాడు యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన లాగ్గాని వెంకటేష్ గౌడ్ తుఫాన్ వాహనం కిరాయి నడుపుతుంటాడు. ఈ క్రమంలో గురువారం ఇదే మండలం ఎదుళ్లగూడేనికి చెందిన మునికుంట్ల వెంకులు ఓ శుభకార్యం నిమిత్తం రంగారెడ్డి జిల్లా కీసరకు తుఫాన్ వాహనం కిరాయి తీసుకొని బంధువులతో కలిసి వెళ్లి వచ్చాడు. అయితే వెంకులు వాహనంలో 25 తులాల బంగారు ఆభరణం, సెల్‌ఫోన్, గుర్తింపు కార్డులు కలిగిన బ్యాగు మరిచిపోయాడు. బ్యాగును గుర్తించిన డ్రైవర్ వెంకులుకు అప్పజెప్పి నిజాయితీని చాటుకున్నాడు.

మరో ఘటనలో మంగళసూత్రం అందజేసిన మహిళ



పుస్తెలతాడును లక్ష్మమ్మకు అందజేస్తున్న అనిత

చిట్యాలరూరల్: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ పరిధిలోని సుర్కంటిగూడేనికి చెందిన సుర్కంటి లక్ష్మమ్మ వెలిమినేడు శివారులోని కొనుగోలు కేంద్రంలో ఈనెల15న ధాన్యాన్ని ఆరబెట్టడానికి వెళ్లింది. ధాన్యం ఆరబెడుతున్న క్రమంలో మంగళసూత్రం పోగట్టుకుంది. అనంతరం మధ్యాహ్నం తన బావి వద్దకు వెళ్లి చూసుకోగా మెడలోని 4 తులాల మంగళసూత్రం కనబడక పోవడంతో బావి వద్ద, ఇల్లంతా వెతికింది. అయినా లభించలేదు. స్థానికంగా వాకబు చేసినా ఫలితం లేక పోయింది. అదే రోజు కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు వెళ్లిన అదే గ్రామానికి చెందిన మిర్యాల అనితకు మంగళసూత్రం దొరికింది. అక్కడ ఎవరూ కనబడకపోవడంతో ఇంటికి వచ్చింది. వ్యక్తిగత పనిమీద వేరే గ్రామానికి వెళ్లిన అనిత గురువారం గ్రామానికి వచ్చింది. విషయం తెలుసుకున్న అనిత గురువారం రాత్రి అనిత ఇంటికి వెళ్లిన లక్ష్మమ్మకు మంగళసూత్రాన్ని అందజేసింది. దీంతో లక్ష్మమ్మ అనితకు కృతజ్ఞతలు తెలిపింది.

రైస్‌మిల్‌లో విజిలెన్స్ బృందం తనిఖీ

చింతపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని నసర్లపల్లిలోని వెంకటసాయి రైస్‌మిల్‌లో హైదరాబాద్‌కు చెందిన విజిలెన్స్ బృందం గురువారం తనిఖీ చేసింది. పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు విస్తృతంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించింది. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుతో పాటు నిల్వల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తీసు కుంటా మన్నారు. వ్యాపారులు మోసానికి పాల్పడితే కేసు నమోదు చేస్తామని హెచ్చ రిం చారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రికార్డుల్లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

మఠంపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లబోతుల కోటయ్య(56)ఈనెల 13న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మూడు రోజులు గడుస్తున్నా తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా అచూకీ లభించలేదు. దీంతో మఠంపల్లి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృతి చెందారు. రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మరణించగా, మరో ఇద్దరు ఆత్మహత్య చేసుకోగా యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే..

కేతేపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి 65వ నంబరు జాతీయ రహదారిని రోడ్డు దాటుతున్న మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందింది. కేతేపల్లి ఎస్ఐ ఎ.శివ తేజగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు గ్రామానికి చెందిన బందనాథం అరుణ పుట్టిల్లు కేతేపల్లి మండలం ఇనుపాముల ఆవాస గ్రామం రాయపురం. కేతేపల్లిలోని ప్రభుత్వ కార్యాలయంలో పని నిమిత్తం ఇక్కడకు వచ్చిన అరుణ స్థానిక ఎస్సీ కాలనీ వద్ద ఆటో దిగి అక్కడ గల జంక్షన్‌లో హైవేను దాటుతున్న క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో అరుణ తలకు, కడుపులో బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108సిబ్బంది ఆమెను సూర్యాపేట జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న అరుణ మరణించినట్లు ఎస్ఐ వివరించారు. మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మిర్యాలగూడలో వృద్ధుడు..

మిర్యాలగూడ అర్బన్ : నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక బంగారు గడ్డకాలనీకి చెందిన గుంటి ఆదినారాయణ(65) స్కూటీపై రోడ్డుపై వెళ్తుండగా ఓ ద్విచక్ర వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆదినారాయణ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి మేనల్లుడు చిలుకూరి బాలు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు వన్‌టౌన్ సీఐ మోతీరాం తెలిపారు.

కాగా మృతుడు ఆదినారాయణ నేత్రాలను దానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించడంతో డైమండ్ నేత్రనిధి ప్రతినిధులు ఆదినారాయణ నేత్రాలను సేకరించారు. దీంతో మరో ఇద్దరు అంధులకు కంటిచూపునిచ్చేందుకు ఆదినారాయణ నేత్రాలు ఉపకరిస్తాయని నేత్రనిధి ప్రతినిధులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

సంస్థాన్ నారాయణపురం : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం చిమిర్యాల గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన కొల్లూరి పవన్ కుమార్ (19) ప్లంబర్. కుర్మకొత్తగూడెం గ్రామంలో ఓ ఇంటికి ప్లంబర్ పని చేయడానికి మరో వ్యక్తితో కలిసి గురువారం వెళ్లాడు. వాటర్ పైప్ వేయడానికి డ్రిల్లింగ్ మిషన్‌తో గోడకు డ్రిల్ చేస్తుండగా విద్యుత్ బోర్డుకు డ్రిల్లింగ్ మిషన్‌కు ఉన్న ప్లగ్ ఊడి కిందపడింది. అప్పటికే ఇంటి గోడలకు నీళ్లు కొట్టడంతో కింద నీళ్లు నిలిచాయి. ఊడిన ప్లగ్ అందులో పడడంతో పవన్‌కుమార్‌కు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి నర్సింహ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పవన్‌కుమార్(ఫైల్)

నిప్పంటించుకుని బాలిక..

బీబీనగర్ : మానసిక స్థితి బాగా లేని ఓ మైనర్ ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన యాదాద్రి భువ నగిరి జిల్లా బీబీనగర్ మండలం రుద్రవెల్లి గ్రామంలో గురువారం జరిగింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రవెల్లి గ్రామానికి చెందిన దండ్రు నర్సింహ నిర్మల దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వీరిలో చిన్న కూతురు దండ్రు దీపిక (17) కొంతకాలంగా మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో అప్పుడప్పుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడేది. కుటుంబ సభ్యుల జాగ్రత్తతో ప్రాణా పాయంతో బయటపడేది. అయితే గురువారం ఉదయం దీపిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో బండిలో నుంచి పెట్రోల్ తీసి నిప్పంటించుకుంది. దీంతో తీవ్ర కాలిన గాయాలతో అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

మానసిక వేదనతో ప్రభుత్వ ఉద్యోగి..



తిరుమలగిరి(సాగర్) : తన తల్లి మృతిచెందడంతో కొద్దికాలంగా మానసిక వేదనకు గురై ప్రభుత్వ ఉద్యోగి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్)మండలం కొంపెల్లి గ్రామంలో బుధవారం ఘటన జరుగగా గురువారం వెలుగులోకి వచ్చింది. కొంపెల్లి గ్రామానికి చెందిన చిత్రం కొండల్(35)యాదాద్రి భువనగిరిజిల్లా కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. 9 నెలల క్రితం కొండల్ తల్లి ఈదమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి కొండల్ మానసికంగా ఇబ్బందులు పడుతున్నాడు. నాలుగు రోజుల క్రితం సెలవుపై ఇంటికి వచ్చిన కొండల్ ఇంట్లోనే ఉంటున్నాడు. బుధవారం ఉదయం తండ్రి చినమల్లయ్య గేదెలను మేపడానికి పొలానికి వెళ్లాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. స్థానికుల సాయంతో కిందకు దింపి చూడగా పురుగుల మందు తాగి అనంతరం ఉరేసుకున్నట్లుగా గుర్తించారు. తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్ఐ వీరశేఖర్ తెలిపారు.

ఇసుక డంప్‌ల సీజ్



ఇసుక డంప్‌ను సీజ్ చేసిన అధికారులు

రాజాపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను గురువారం తహసీల్దార్ అనిత సీజ్ చేశారు. సుమారు 240 ట్రిప్పుల ఇసుకను అనుమతులు లేకుండా నిల్వ చేశారని వారు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకోసం ఇసుక అనుమతి తీసుకొని పక్కాదారి పట్టించారని పేర్కొన్నారు.

పొలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మునగాల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మునుగాల మండల కేంద్రం శివారులో పొలంలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తూముల వీరస్వామి పొలాన్ని కోత మిషన్‌తో కోపిస్తుండగా దుర్వాసన వచ్చింది. దీంతో పరిసర ప్రాంతాలను పరిశీలించగా బురదలో ఓ వ్యక్తి మృత దేహం కనిపించింది. వెంటనే వీరస్వామి స్టేషన్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన పోలీస్ సిబ్బందితో పొలం వద్దకు వెళ్లి పరిశీలించారు. సుమారు 40 ఏళ్లలోపు వయస్సు గల వ్యక్తిగా గుర్తించారు. బ్లూ కలర్ జీన్ పాయింట్, టీషర్ట్‌తో మృతదేహం కుళ్లిపోయివాసన వస్తున్నది. ఐదురోజుల క్రితం వచ్చిన గాలి వానకు పొలంలో ఎల్‌టీ లైన్ విద్యుత్ వైర్లు తెగిపడి విద్యుదాఘాతంతో మృతి చెంది ఉండ వచ్చని అని భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ లభించలేదు. కుళ్లిన మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆస్పత్రి మార్చురీ గదిలో ఉంచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు వెంటనే పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆక్రమణల కూల్చివేతకు కలెక్టర్ ఆదేశాలు



సర్వే చేస్తున్న తహసీల్దార్, సర్వేయర్

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాల కూల్చివేతకు రెవెన్యూ అధికారులు సత్వర చర్యలకు ఉపక్రమించారు. అక్రమణల ఫిర్యాదులు వచ్చిన నిర్మాణాలు జరిగిన స్థలంలో గురువారం సర్వే చేసి డీ మార్కేషన్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి గ్రామ పంచాయ తీ పరిధిలో సర్వే నంబర్ 550లో సుమారు 106 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. వీటిలో సుమారు 100 ఎకరాల విస్తీర్ణం మేర పలు దఫాలుగా ప్రభుత్వం అసైన్డ్ కమిటీ నిర్ణయం మేరకు లబ్ధిదారులకు పట్టా లు పంపిణీ చేసింది. అయితే ఇదే సర్వే నంబర్‌లోని ప్రభుత్వం అసైన్డ్ చేయగా మిగిలిన కొంత భూమితో పాటు రామిడి గోపాల్ అనే ఓ పట్టాదారుడికి అసైన్డ్ చేసిన 15 గుంటల భూమిలో ఓ విత్తన కంపెనీ యాజమాన్యం భవనాలను నిర్మించింది. దీంతో రామిడి గోపాల్ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించి విచారణకు కలెక్టర్ ఆదేశించగా ఇప్పటికే పలు దఫాలుగా జిల్లా సర్వే అధికారి (డీఐ), ఆర్డీవో, మండల రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే చేశారు. సర్వే నివేదికను కలెక్టర్‌కు అందజేయగా బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఇలా త్రిపాఠి విచారణ నిర్వహించారు. ఫిర్యాదు ఎదుర్కొంటున్న నిర్మాణాలు గల భూమి ప్రభుత్వ భూమి కాదని కంపెనీ యాజమాన్యం నిరూపించలేకపోయింది. పైగా వసర్వేయర్ నివేదిక కూడా షెడ్డు నిర్మాణంలో సుమారు 15 నుంచి 19 గుంటల వరకు ప్రభుత్వ భూమి ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించే సర్వే నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దీంతో ఆక్రమణలను 48 గంటల్లో కూల్చివేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, సర్వేయర్ బీ.శ్రీనివాస్, ఆర్ఐ భవానీ గురువారం సంబంధిత కంపెనీ షెడ్డు నిర్మాణ స్థలాన్ని సర్వే చేసి ప్రభుత్వ భూమి ఉన్నంత వరకు డీ మార్కేషన్ చేశారు. ఆక్రమిత ప్రభుత్వ స్థలాన్ని 48 గంటల్లో ఖాళీ చేయాలని కంపెనీ యజమానికి నోటీసులు సిద్ధచేస్తున్నారు.

బిర్యానీలో ఈగ.. రూ.5 వేల జరిమానా



జరిమానా విధిస్తున్న మునిసిపల్ అధికారులు

సూర్యాపేటటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): హోటల్ యాజమాన్యాలు ప్రజల ఆరోగ్యాలతో చెలగాట మాడితే కఠిన చర్యలు తీసుకుంటా మని మునిసిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని దురాజ్‌పల్లి వద్ద గల హంగ్రీ బర్డ్స్ బిర్యానీ సెంటర్‌లో బిర్యానిలో ఈగ వచ్చినట్లు కస్టమర్ ఫిర్యాదు చేశారు. దీంతో తనిఖీలు నిర్వహించి యాజమాన్యానికి రూ. 5000 జరిమానా విధించారు. హోటల్ నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ సీహెచ్. శివప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కాల్వల భూపరిహారం
నిధులూ మింగేశారు

● ఫోర్జరీ సంతకాలతో నిధులు కాజేసిన అధికారులు



ఏఎమ్మార్పీ డిస్ట్రిబ్యూటరీ 8,9కి అనుసంధానంగా నిర్మించిన 15 ఆర్ మైనర్ కాల్వ

ఏఎమ్మార్పీ డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణంలో భూనిర్వాసితులకు మంజూరైన నిధులను కొందరు అధికారులు కాజేశారు. సుంకిశాల- కోదండాపూర్ భూనిర్వాసితులకు చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని ఫోర్జరీ సంతకాలతో దోచినట్లుగానే ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ 9, డిస్ట్రిబ్యూటరీ కాల్వ 8,9కి అనుసంధానంగా నిర్మించిన 15ఆర్ మైనర్ల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు దక్కాల్సిన నిధులను స్వాహా చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రెండు ప్రాజెక్టులకు సంబంధించి భూనిర్వాసితుల పరిహారాన్ని ఫోర్జరీ సంతకాలతో కాజేసిన వ్యవహారంలో ఓ రెవెన్యూ అధికారి కీలకపాత్ర వహించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు(ఏఎమ్మార్పీ) ప్రధాన కాల్వ 9కి అనుసంధానంగా మైనర్ కాల్వలను నిర్మించడానికి 2007 అక్టోబరులో ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. డిస్ట్రిబ్యూటరీ 8,9 లకు పర్వేదుల వద్ద నుంచి నాటి చలకుర్తి గ్రామపంచాయతీ మల్లోరికుంట తండా వరకు సుమారు 2 కి.మీ మేర 15 ఆర్ మైనర్ కాల్వ ఏర్పాటు చేసేందుకు 44 మంది రైతుల నుంచి భూమిని సేకరించింది. ఇం దుకు ఎకరానికి రూ.80 వేల చొప్పున పరిహారం ప్రకటించింది. భూనిర్వాసితులకు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పేరున ఏఎమ్మార్పీ యూనిట్ 11 నల్లగొండ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజేషన్) చెక్కులను జారీ చేశారు. అయితే సంఘమిత్ర కో-ఆపరేటివ్ బ్యాంకు నల్లగొండలో లబ్ధిదారుల ఖాతాలు తెరిపించి ఏజెంట్ అవతారం ఎత్తిన అధికారి నిధులు డ్రాచేసి తన కమీషన్ కట్ చేసుకుని కొందరికీ పరిహారం అందజేయగా మరికొందరి లబ్ధిదారులకు తెలియకుండా ఫోర్జరీ సంతకాలతో లక్షలు కాజేసినట్లు సమాచారం.

ఆయనే కీలకం

భూపరిహారాన్ని నిర్వాసితులకు అందకుండా కాజేసినవారిలో ఓ పంచాయతీ అధికారే కీలకమని బాధితులు ఆరోపిస్తున్నారు. పర్వేదుల గ్రా మానికి చెందిన అధికారి అనారోగ్యానికి గురై విధులు నిర్వహించలేని స్థితిలో ఆయన కుమారుడు అనాధికారికంగా అన్నిసర్టిఫికెట్లపై, రిజిష్టర్లలో తండ్రి సంతకాలు తానే ఫోర్జరీ చేస్తూ అక్రమాలకు తెర లేపినట్లు బాధితులు వాపోతున్నారు. అనతికాలంలో తండ్రి ఉద్యోగంలో నియమాకమై పదోన్నతి పొంది ప్రస్తుతం సొంత మండలంలోనే రెవెన్యూ శాఖలో అధికారిగా విధులు నిర్వహిస్తుండగా, చిన్న ఉద్యోగం తోనే కోట్లలో ఆస్తులను కూడబెట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఫోర్జరీ సంతకాలతో నిధులు కాజేశారు

నా భూమి 2 ఎకరాలు, మా సోదరుడి కుమారుడిది ఎకరం 10 గుంటలు మైనర్‌కాల్వ నిర్మాణంలో పోతుండడంతో ప్రభుత్వం పరిహారం కింద రూ.3.05 లక్షల పరిహారం ప్రకటించింది. మా కుటుంబం ఊర్లో లేని కాలంలో మా సంతకాలను ఫోర్జరీ చేసి పంచాయతీ అధికారి కాజేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాను.

- మేరెడ్డి జైపాల్‌రెడ్డి, పెద్దవూర

కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నాం

పరిహారం నిధులు కాజేసిన విషయమై బాధితుల నుంచి ఫిర్యాదు అందింది. పెద్దవూర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ సాగిస్తున్నాం.

- శ్రీనునాయక్, సీఐ, నాగార్జునసాగర్

ఆరుగురు లబ్ధిదారులకు అందని పరిహారం

తమకు పరిహారం అందలేదని సంబంధిత భూనిర్వాసితులు నల్లగొండ సంఘమిత్ర సహకార బ్యాంకులో తమకు జారీ చేసినట్లు చెబుతున్న చెక్కుల గురించి వివరాలు అడిగితే బ్యాంకు అధికారులు ఏ సమాచారం ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. పర్వేదులకు చెం దిన మేరేడ్డి జైపాల్‌రెడ్డి(2 ఎకరాలు) అతడి సోదరుడి కుమారుడు సాయిశరత్‌రెడ్డి(ఎకరం) స్థానికంగా లేనప్పటికీ అన్ని రికార్డుల్లో వారి సంతకాలను ఫోర్జరీ చేసి వారి పేరున 80, 91, 92, 93 గల 3 ఎకరాల10 గుంటల భూమి, అందులోని 127 బత్తాయి చెట్లుకు జైపాల్‌రెడ్డి ఒక్కరి పేరున రూ. 3,05,221 మంజూరు చేసినట్లు చూపి ఫోర్జరీ సంతకాలతో కాజేసినట్లు ఆరోపించారు. మరో 5గురికి లక్షల్లో అందాల్సిన పరిహారాన్ని మింగేసినట్లు అనుమానిస్తున్నారు. ఇందుకు సంబంధించి బ్యాంకు అధికారులను చెక్కుల డ్రా కు సంబంధించి సంబం ధిత లబ్ధిదారులు వివరాలు అడిగితే బ్యాంకు అధికారులు సాకులు చెబుతూ దాటవేస్తున్నారని అంటున్నారు.

ఓ మాట .. మహోద్యమానికి బాట



భూదాన్‌పోచంపల్లిలోని ఆచార్య వినోబాభావే వెదిరె రామచంద్రారెడ్డి కాంస్య విగ్రహాలు


'దేశంలో భూమి కోసం ఎన్నో యుద్ధాలే జరిగిన సంఘటనలు ఉన్నాయి. కానీ, ఓ స్ఫూర్తివంతమైన వ్యక్తి చెప్పిన మాట మహోద్యమానికి దారి తీసింది. భూదానోద్యమానికి వెదిరె రామచంద్రారెడ్డి ముందడుగు వేస్తే.. ఈ నడక పలువురికి మేలు చేసేలా చేసింది. ఆచార్య వినోబా భావే. 1951 ఏప్రిల్ 18న దేశ చరిత్రలోనే భూమిని దాన రూపంగా ఇచ్చి భూదానోద్యమానికి నాంది పలి కిన పోచంపల్లి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ప్రాంతంగా చోటు చేసుకుంది. నేడు భూదానోద్యమ జయంతి వజ్రో త్సవాల సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : గాంధీజీ ఆశయాలు, సర్వోదయ సిద్ధాంతాలను ప్రచారం కోసం ఆచార్య వినోబా భావే పౌనార్ ఆశ్రమాన్ని వీడి దేశమంతటా పాదయాత్ర చేయడానికి సిద్ధమయ్యారు. అదే సమయంలో సర్వోదయ నాయకుడు శ్రీ రామకృష్ణ దూత్ ఆహ్వానం మేరకు 1951 ఏప్రిల్ 15న హైదరాబాద్ సమీపంలో గల శివరాంపల్లిలో నిర్వహించే సర్వోదయ సమ్మేళనంలో తన సందేశాన్ని ఇవ్వడానికి వచ్చారు. అదే సమయంలో తెలంగాణ సాయుధ పోరాటం సాగుతున్న తరుణంలో నల్ల గొండ జిల్లాలజరుగుతున్న రజాకార్ల దోపిడీ, కల్లోల పరిస్థితులు తెలుసుకుని వెంటనే పాదయాత్రగా బయలుదేరి 17న ప్రస్తుత యాదాద్రి-భువనగిరి జిల్లాలోని పోచంపల్లికి వినోబాభావే చేరుకున్నారు. మరుసటి రోజు ఏప్రిల్ 18న హరిజనులతో ఆయన సమావేశమయ్యారు. దీంతో వారు తమ గోడును వెళ్లబోసుకున్నారు. వినోబాభావే అందుకు స్పందిస్తూ.. మీలో ఎవరైనా భూమిని దానం చేసేవారున్నారా? అని ప్రశ్నించారు. అక్కడ జన సందోహం మధ్యలో ఉన్న వెదిరె రామచంద్రారెడ్డి లేచి తన తండ్రి జ్ఞాపకార్థం 100 ఎకరాల సేద్యయోగ్యమైన భూమిని దానం చేస్తానని ప్రకటించారు. అక్కడికక్కడే దాన పత్రాన్ని రాసి వినోబాభావేకు అందజేశారు. అలా లభించిన ఆ భూమిని వినోబాభావే పేదలకు పంచి భూదానోద్యమానికి బీజం వేశారు. వినోబాభావే పోచంపల్లికి వచ్చే వరకు భూదానోద్యమంపై ఆలోచన రాలేదు. యాదృచ్ఛికంగా భూదానోద్యమం ఒక స్పష్టమైన కార్యక్రమంగా రూపుదిద్దు కుంది. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా దాదాపు 80వేల కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించి 1970 వరకు దాదాపు 44 లక్షల ఎకరాల భూమిని భూదానోద్యమంలో సేకరించారు. సుమారు 40లక్షల మందికి దానం చేశారు.

● భూదానోద్యమానికి నాంది పలికిన పోచంపల్లి

పోచంపల్లిలో మూడు సార్లు పర్యటన

ఆచార్య వినోబాభావే పోచంపల్లిలో మొత్తం మూడు సార్లు పర్యటించి తన పాదయాత్ర ద్వారా 1.70 లక్షల ఎకరాల భూమిని సేకరించారు. అలాగే రెండోసారి ఉమ్మడి రాష్ట్రంలోని శ్రీకాకుళం నుంచి 1955 డిసెంబర్‌లో పాదయాత్ర ప్రారంభించి 1956లో గాంధీ వర్ధంతి రోజున జనవరి 30న పోచంపల్లికి చేరుకున్నారు. సేకరించిన 1.70 లక్షల ఎకరాల్లో 1.26 లక్షల ఎకరాల భూమికి మాత్రమే చట్టబద్ధత కలిగి ఉంది. జిల్లాలో సైతం వేల ఎకరాల భూమిని భూమిలేని నిరుపేదలకు పంచిపెట్టారు. ఇలా భూదానోద్యమానికి అంకురార్పణ జరిగిన పోచంపల్లిని 'భూదాన గంగోత్రి'గా అభివర్ణిస్తూ ఆయన తన రెండో జన్మస్థలంగా పోచంపల్లిని పేర్కొన్నారు



వినోబాభావేకు దానపత్రం అందిస్తున్న వెదిరె రామచంద్రారెడ్డి (ఫైల్)

నేడు భూదాన్ జయంతి వజ్రోత్సవాలు



భూదాన్ జయంతి వజ్రోత్సవాలు శుక్రవారం భూదాన్‌పోచంపల్లిలో వినోబామందిరంలో ఘనంగా నిర్వహిస్తాం డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు డా.గున్న రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన శాంతిహోమం, 'భూభారతి-భూదాన్ భూముల సమస్యలకు పరిష్కారం' అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తాం. ఈ కార్యక్రమానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నారు.

- యానాల ప్రభాకర్‌రెడ్డి, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రారంభానికి నోచుకోని వినోబా మందిరం

భూదానోద్యమానికి నాంది పలికిన భూదాన్‌పోచంపల్లిలో స్మృతి చిహ్నంగా నిర్మించిన వినోబామందిరం నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. శిథిలమైనందున దశాబ్దకాలం క్రితం రూ.50లక్షలతో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో భూదాన్‌పోచంపల్లి పట్టణంలో వినోబామందిరాన్ని పునర్నిర్మించారు. ఈ మందిరం నిర్వహణ కానీ, దాని ఆలనాపాలనా లేక ఎప్పుడూ తాళం వేసే కనిపిస్తోంది. అయితే వినోబామందిరం నిర్వహణ బాధ్యత రాష్ట్ర భూదాన్‌యజ్ఞ బోర్డు చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. తన సొంత నిధులతో ఈ భవనంలో గాంధీజీ, వినోబాభావేలకు సంబంధించిన సాహిత్యాన్ని, భూదానోద్యమ చారిత్రక ఘట్టాలను చాటే మ్యూజియం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వం వినోబా మందిరం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని భూదాన్‌పోచంపల్లిలోని వినోబామందిరం

నేడు భూభారతి చట్టంపై అవగాహన

బొమ్మలరామారం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన తెలంగాణ భూ భారతి చట్టంపై శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే అవగాహన కార్యక్రమానికి మండలంలోని రైతులందరూ హాజరు కావాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ భారతి చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు.

కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

భువనగిరి టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మునిసిపల్ ఖాతాలో రూ.25 కోట్లు స్టాంపు డ్యూటీ నిధులు ఉన్నప్పటికీ కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమని అన్నారు. దీంతో వేతనాల చెల్లింపు చర్యలు తీసుకుంటామని కమీషనర్ జి.రామలింగం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు



చౌటుప్పల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య

చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దళారులకు ధాన్యాన్ని విక్రయించి రైతులు మోసపోవద్దని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం తో పాటు ధాన్యం శుభ్రం చేసే అధునిక యంత్రాన్ని ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోధర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మునుగోడు అసెంబ్లీ ఇన్‌చార్జ్ పబ్బు రాజుగౌడ్, తహసీల్దార్ హరికృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, సెక్రటరీ వి.రవీందర్‌రెడ్డి, ఏవో నాగరాజు, సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ బి.మురళి, మొగుదాల రమేష్, పీఏసీఎస్ సెక్రటరీ వై.రమేష్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని సైదాపురం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆలేరు మార్కెట్‌కమిటీ చైర్మన్ ఐనాల చైతన్యమహేందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో గుట్ట పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మిడి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, సర్పంచ్‌ల ఫోరం మాజీ రాష్ట్ర కార్యదర్శి బీర్ల శంకర్, దుబ్బాల వెంకట్‌రెడ్డి, శిఖ ఉపేందర్‌గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తుర్కపల్లి: మండలంలోని దత్తాయపల్లి, వెంకటాపూర్, మాదాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ చైర్మన్ అయినాల చైతన్యమహేందర్‌రెడ్డి ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నర్సింహారెడ్డి, ఏపీఎం యాదగిరి, మాజీ ఎంపటీసీలు ధనావతు మోహన్‌బాబు, కానుగంటి శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దానావతు శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పూర్ణగిరి ఆలయ చైర్మన్ రావి సురేందర్‌రెడ్డితో కలిసి భువనగిరి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కనుకుంట్ల రేఖ బాబు రావు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. నాయకులు చిక్కుల వెంకటేశ్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, పిట్టల రజిత, చిన్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలోని వెల్వర్తి గ్రామంలో ఐకేపీ ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం జానీ ప్రారంభించారు.

న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి



చౌటుప్పల్‌లో కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రామన్నపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం రూపొందించాలని, సూర్యాపేటలో అడ్వకేట్ ఎం.కిషోర్‌పై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది కేమ రామదాసు డిమాండ్ చేశారు. రామన్నపేటలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ న్యాయవాదులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని దాడులను అరికట్టే విధంగా ప్రభుత్వం వెంటనే న్యాయవాద రక్షణ చట్టాన్ని తీసుకొని రావాలని ప్రభుత్వాన్ని కోరారు. దాడికి నిరసనగా సూర్యాపేట బార్ అసోసియేషన్, విధుల బహిష్కరణకు, వారు చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నామని తెలిపారు. న్యాయవాదులంతా ఐక్యతగా ఉండి న్యాయవాద రక్షణ చట్టాన్ని సాధించుకోవాలని అన్నారు. సమావేశంలో ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు పాల్వంచ జగతయ్య, యాదాసు యాదయ్య, గడ్డం నరసింహ పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ఎదురుగా బార్ అసోసియేషన్ అధ్వర్యంలో న్యాయవాదులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో చౌటుప్పల్ బార్ అసోసియేషన్ (న్యాయవాదులు) అధ్యక్షుడు బాల్యం వెంకటాచలపతి, ప్రతినిదులు ఊడుగు శ్రీనివాస్, పి.మహిపాల్‌రెడ్డి, రాపోలు వేణు, రమేష్, జక్కర్తి శేఖర్, జ్యోతి, ఖయ్యూమ్ పాషా, సత్తిరెడ్డి, తడక మోహన్, పరమేష్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట కోర్టు న్యాయవాదులు గురువారం కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూదగాని శ్రీహరిగౌడ్, ఆలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వనం రాజు, న్యాయవాదులు పెంట రమేష్, ఐరేణి కృష్ణ, దండెబోయిన గణేష్, బి. రేణుక, సంతోష పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును రద్దు చేయెుద్దు: ఏఐటీయూసీ

భువనగిరి గంజ్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును రద్దు చేసే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.ఇమ్రాన్ అన్నారు. గురువారం భువనగిరిలో పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహసభల గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బొలగాని సత్యనారాయణ, సహయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, పబ్బుల రాజు, బీరకాయల మల్లేష్, దుబ్బాక సంజీవ, దాసరి లక్ష్మయ్య, బహూపేట వెంకటయ్య, సామల శోభన్ బాబు, చిగుర్ల లింగం పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

భువనగిరి రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం దృష్ట్యా మండలంలోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేక అధికారి జినుకల శ్యాంసుందర్ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాల్‌లో ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్‌తో కలిసి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సకాలంలో నీటి సరఫరా చేయాలని అవసరమైతే బోర్లను అద్దుకు తీసుకుని నీటిని అందించాలన్నారు. అదే విధంగా ఉపాధి హామీ పథకం , ఇందిరమ్మ ఇళ్ల నర్సరీల నిర్వహణ , రాజీవ్ యువవికాసంపథకం తదితర అంశాలపై చర్చించారు. ఈసమావేశంలో ఎంపీవో దినకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గుండురావు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కమిటీల ఎన్నిక

భువనగిరి టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): టీయూడబ్ల్యూజే (ఐజేయూ) భువనగిరి ప్రింట్, ఎలక్ట్రానికల్ మీడియా నూతన కమిటీలను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యంబ నరసింహులు, పోతంశెట్టి కరుణాకర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు భువనగిరి మల్లేశం, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు ఎలిమినేటి జహంగీర్ సమక్షంలో నూతన కమిటీలను ఎన్నుకున్నారు. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఉత్తమ జర్నలిస్టు ఉగాది పురస్కారాన్ని అందుకున్న సీనియర్ జర్నలిస్ట్, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు జీవీ.శ్రీనివాస్‌ను సన్మానిచారు. ప్రింట్ మీడియా కమిటీ అధ్యక్షుడిగా మరికొండ మల్లేశం, ఉపాధ్యక్షుడిగా చింతపాండు రాజు, ఎండీ.సుజాయుద్దీన్, గుర్రాల శివ, ప్రధాన కార్యదర్శిగా కందుల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా సోమ రాజిరెడ్డి, గోపే మహేష్ ఎన్నికయ్యారు.

ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ అధ్యక్షుడిగా పాములపర్తి లక్ష్మీనారాయణచారి, ఉపాధ్యక్షులుగా ముద్దం ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాడ్గుల శంకర్, ఎండీ.ముజీబ్‌పటేల్, ప్రధాన కార్యదర్శిగా శ్రీచరణ్, సహాయ కార్యదర్శులుగా మెరుగు అనిల్, కూరెళ్ల శ్రీనివాసచారి, వీరెళ్లి రమేష్, కోశాధికారిగా నిమ్మల సురేష్‌గౌడ్, కార్యవర్గ సభ్యులుగా కోనేటి చంద్రమౌళి, ఎండీ ఖదీర్, మహంకాళి సురేష్, మోత్కూర్ నరసింహచారిని ఎన్నుకున్నారు.

పెద్దరావుపల్లిలో బీజేపీ జెండా ఆవిష్కరణ


భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని గురువారం మండల పరిధిలోని పెద్దరావులపల్లి గ్రామంలో బీజేపీ జెండావిష్కరణ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, భూదాన్‌పోచంపల్లి మాజీ సర్పంచు నోముల గణేష్, జిల్లా కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షులు మేకల చొక్కారెడ్డి, ఓబీసీ జిల్లా అధికార ప్రతినిధి పల్లెకాడి బస్వయ్య, బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు కేసారం కృష్ణారెడ్డి, మండల కోశాధికారి సీత లక్ష్మయ్య, బూత్ అధ్యక్షులు మట్ట శంకర్‌గౌడ్, గుర్రాల శ్రీకాంత్, సీనియర్ నాయకులు పంతంగి వినయ్, బడె రాజు, మరిపాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు వేశారు..మట్టి పోయడం మరిచారు

● దశాబ్దం దాటినా పట్టించుకోని అధికారులు



భారీ వాహనాలు వెళ్లడంతో పగుళ్లు వచ్చి ధ్వంసమైన రోడ్డు



తుర్కపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మట్టి రోడ్లతో ప్రజలు నరక యాతనపడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకుగాను ప్రభుత్వం గ్రామాల్లో సీసీ రోడ్లు వేసి వారి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేస్తోంది. అందులో భాగంగా ప్రతి సంవత్సరం ప్రభుత్వం ఎస్‌డీఎఫ్, పంచాయతీరాజ్‌శాఖ, ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులు ద్వారా సీసీ రోడ్ల నిర్మాణానికి కోట్లాది రూపాయలను వెచ్చిస్తోంది. ఈ రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు సీసీ రోడ్లు వేస్తున్నారు కానీ ఆ రోడ్లకు ఇరువైపులా(రోడ్డు సైడ్ బర్మలకు) మొరం మట్టి పోయక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుర్కపల్లి మండలం ముల్కలపల్లి ఎస్సీ కాలనీ ఆ గ్రామ పంచాయతీ పరిధిలోని గంగరాం తండా, జేతిరాం తండా, కీమ్యతండ, బోజ్యతండాలో సీసీ రోడ్లు చేపట్టేందుకు గాను 2014లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వార సుమారు రూ.30.50లక్షలు మంజూరు చేయగా ఆ నిర్మాణ పనులకు అప్పటి ఆలేరు ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. కానీ అప్పటి నుంచి నేటి వరకు రోడ్డు సైడ్ బర్మలకు మొరం మట్టి పోయక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు రోడ్డుపై వెళుతున్నప్పుడు రోడ్డుకు పగుళ్ల వచ్చి ధ్వంసమవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లకు రోడ్డు బర్మలకు మొరం మట్టి పోయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పదేళ్లుగా పట్టించుకోవడంలేదు



ముల్కలపల్లి గ్రామం నుంచి గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీకి వెళ్లేందుకు సుమారు మూడు వందల మీటర్ల దూరం దశాబ్దం క్రితం ఎన్ఆర్‌ఈజీఎస్ కింద సీసీ రోడ్డు వేశారు. రోడ్డుకు ఇరువైపులా మూడు మీటర్ల లో తు ఉంటుంది. రోడ్డు సైడ్ బర్మలకు మొరం మట్టి పోయక పోవడంతో రోడ్డు ఇరువైపులా కుంగిపోయి దెబ్బతిన్నది. మొరం మట్టి పోసి ప్రమాదాలు జరగకుండా చూడాలని 10 సంవత్సరాలుగా గ్రామ సభల్లో అధికారులు, ప్రజాతినిధుల దృష్టికి ఎన్నోసార్లు తీసుకెళ్లినా పట్టింపు లేదు. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరు వైపులా మట్టి పోసి ప్రమాదాలు జరగకుండా చూడాలి

-కోట బిక్షపతి, ముల్కలపల్లి(ఎస్సీ కాలనీ)

మట్టి పోసిన తర్వాతే ఎంబీ రికార్డ్ చేయాలి



గ్రామాల్లో సీసీ రోడ్లు వేస్తున్నారు కానీ రోడ్డు సైడ్ బర్మలకు మొరం మట్టి పోయక పోవడంతో గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డు ఇళ్లకన్నా ఎత్తు కావడంతో రాత్రి వేళల్లో గ్రామస్థులు, వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సబంధిత అధికారులు ఏ గ్రామంలోనైతే సీసీ రోడ్లు వేస్తారో ఆ గ్రామంలో పర్యటించి సీసీ రోడ్లకిరువైపులా మొరం మట్టి పోసిన తర్వాతే ఎంబీ రికార్డ్ చేసి కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వాలి.

- బానోత్ చత్యనాయక్, తుర్కపల్లి

రోడ్డు సైడ్ బర్మలకు మట్టిని పోయిస్తాం

మండలంలోని ఆయా గ్రామాల్లో వేసిన పాత రోడ్లకు సంబంధించి రికార్డులను పరిశీలించి ఏ గ్రామంలోనైతే రోడ్లకిరువైపులా మట్టి పోయలేదో గుర్తించి, ప్రభుత్వానికి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతాం. మండలంలో ఇటీవల వేసిన సీసీ రోడ్లకైతే ఇరువైపుల మట్టిని పోయిస్తున్నాం. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన రోడ్లకు సంబంధించి ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం మార్చి 31లోపు ఎంబీ రికార్డ్ చేసుకుని, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఉంటే నిధులు ల్యాప్స్ కావు.

- చక్రధర్, పీఆర్ఏఈ, తుర్కపల్లి

కేసీఆర్ పథకాలే ఆదర్శం



యాదగిరిగుట్ట రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సునీత

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జీ క్యామ మల్లేశం సంక్తంగా అన్నారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలో పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య అధ్యక్షతన బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయడానికి సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు రైతులందరికి బేషరతుగా రూ. 2లక్షల రుణాలు మాపీచేస్తానని కేవలం 35శాతం మంది రైతులకే రుణమాఫీ చేశారని అన్నారు. రైతు భరోసా పథకం ద్వారా రైతులందరికీ రైతు భరోసా ఇవ్వడంలేదని, రైతు బీమాపథకం జాడే లేదని, రైతులకు ఇచ్చిన హామీలను తుంగలోతొక్కి మోసం చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందని అన్నారు. ప్రజలంతా బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి అధికారంలోకి కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో నష్టపోయిన ప్రజలు, రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 27న వరంగల్లో జరిగే 25వసంతాల రజతోత్సవ సభకు ఆలేరు నియోజకవర్గం నుంచి సుమారు 15వేల మంది ప్రజలు, నాయకులను పెద్దఎత్తున తరలిస్తామని తెలిపారు. ఇదుకు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ఆయా మండలాల నాయకులు ప్రత్యేక చొరవతీసుకుని ఎక్కువ సంఖ్యలో యువతను తరలించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డి, గుట్ట పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మిడి రాంరెడ్డి,మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు కర్రె వెంకటయ్య, కసావు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, ఆలేరు మున్సిపల్ మాజీ చైర్మన్ శంకరయ్య, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనురాధబీరయ్య, మిట్ట వెంకటయ్యగౌడ్, పట్టణ కార్యదర్శి నరహరి పాల్గొన్నారు.



బీబీనగర్: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

బీబీనగర్: సాధ్యం కాని దొంగ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలు అమలు చేయలేక ఆపసోపాలు పడుతోందని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు బహిరంగ సభ ప్రచార వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రాచమల్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీఎంపీపీ సుధాకర్‌గౌడ్, నాయకులు బొక్క జైపాల్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మల్లగారి శ్రీనివాస్, వెంకట కిషన్ రావు, ఆకుల ప్రభాకర్, చింతల సుదర్శన్ రెడ్డి, లింగయ్య గౌడ్, గాదె కవిత, సంతోష్ రెడ్డి, లక్ష్మీనారాయణ, బిట్టు, శ్రీశైలం, జక్కి నగేశ్ , శేఖర్ రెడ్డి, రవికుమార్, గణేశ్ యాదవ్, రామకృష్ణ, నరహరి, బాలరాజు గౌడ్ పాల్గొన్నారు.

రాజాపేట: రాజాపేట మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షులు సట్టు తిరమల్లేష్ తెలిపారు. పార్టీ రజతోత్సవ సభ విజయవంతంకోసం మండల కేంద్రంలో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏకం కావాలి



ముత్తిరెడ్డిగూడెంలో రాజ్యాంగాన్ని పరిరక్షించాలని పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తుర్కపలి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతీ ఒక్కరు ఏకం కావాలని ఆలేరు మార్కెట్ చైర్మన్ అయినాల చైతన్యమహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధానావతు శంకర్‌నాయక్ అన్నారు. జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని దత్తాయపల్లి, వెంకటాపూర్, వేలుపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా గాంధీజీ, అంబేద్కర్ చిత్ర పటాలను, రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాన కల్పించారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు చాడ బాస్కర్‌రెడ్డి, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు దనావతు మోహన్‌బాబు, కానుగంటి శ్రీనివాస్ యాదవ్, ఏఎంసీ డైరక్టర్ పట్టునాయక్, నాయకులు దేవరుప్పల అయిలయ్య, రామగోని వెంకటేశ్ గౌడ్, సొన్నాయిల రఘు, డి. మల్లేశ్, కూరెళ్ల రాజాలు, వి.రాజయ్య, గుగులోత్ దుప్‌సింగ్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని మహబూబ్‌పేట, మర్రిగూడెం, చొల్లేరు, రామాజీపేట, చిన్నకందుకూర్, పెద్దకందుకూర్ గ్రామాల్లో అంబేద్కర్ చిత్రపటం ప్రదర్శిస్తూ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజ్‌గౌడ్, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, సైదాపురం మాజీ సర్పంచ్ బీర్ల శంకర్, నాయకులు దుంబాల వెంకట్‌రెడ్డి, శిఖ ఉపేందర్ గౌడ్, యాదయ్య, గాజుల రవి, సత్తిరెడ్డి, చిన్నం శ్రీను, రాంచందర్ పాల్గొన్నారు.

మోటకొండూరు: మండలంలోని కదిరేనిగూడెం, ముత్తిరెడ్డిగూడెం గ్రామాల్లో జైబాపు, జైభీమ్, జైసంవిదాన్ కార్యక్రమం నిర్వహించి పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగపురం మల్లేష్, ఆలేరు మర్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొంతం మోహన్‌రెడ్డి, చాడ శశిధర్‌రెడ్డి, భూమండ్ల శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ కొమ్మగాని ప్రభాకర్, రేగు శ్రీనివాస్, ఓర్సు యాదగిరి, మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి, ఏక్ సంజీవరెడ్డి, పంతుల భూపాల్, భూమండ్ల ఇస్తారి, మధు పాల్గొన్నారు.

మొక్కలు నాటి, సంరక్షించాలి

మోత్కూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ జోగినిపల్లి సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా హరిత సేన మహిళా విభాగం అధ్యక్షురాలు మాధురి వెంకటేష్ మోత్కూరు పట్టణ హరితసేన మహిళా అధ్యక్షురాలిగా కట్ట ఇంద్రజ్యోతిని నియమించారు. గురువారం నూతన అధ్యక్షురాలు ఇందిరజ్యోతి, బీఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు దబ్బెటి శైలజతో కలిసి మొక్కలు నాటారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

మోత్కూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మోత్కూరు అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ భీముడు కోరారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం మోత్కూరు మండల కేంద్రంలోని అగస్త్య ఆస్పత్రిలో వారు అగ్ని ప్రమాదాలు-నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. సిబ్బంది జి.వెంకటేశ్వర్లు, డి.అర్వపల్లి, బి.రవీంద్రనాయక్, బి.సిద్దిక్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గుండాల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వెటర్నరీ డాక్టర్ యాకూబ్ అన్నారు. మండల కేంద్రంలోగురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ రైతులు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని సూచించారు. ఈసందర్భంగా గ్రామంలో 200 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరి అసిస్టెంట్ రాజు, గోపాలమిత్రలు గోవింద్, కృష్ణ పాల్గొన్నారు.

గోపాల్‌గురుస్వామికి పరశురామ అవార్డు

రామన్నపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన రుద్రాల గోపాల్ గురుస్వామికి శబరి సన్నిధానంలో అయ్యప్ప స్వామి పుట్టిన రోజు సందర్భంగా పరశురామ అవార్డును డివోషనల్ మహాశాస్త్ర సంఘం కలిసి శ్రీ పంబ గణపతి సన్నిధానం వద్ద శ్రీ శివ నరసింహ తాంత్రి, శబరిమల మాజీ అధ్యక్షుడు వినోద్ కన్నా, శంకర నంబూద్రి నుంచి ఈ అవార్డు రుద్రాల గోపాల్ గురుస్వామి అందుకున్నారు.

కుర్రారంలో మాతమ్మ పండుగ

రాజాపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాజాపేట మండంలోని కుర్రారం గ్రామంలో గురువారం భక్తిశ్రద్ధలతో గ్రామస్థులు మాతమ్మ పండులను ఘనంగా నిర్వహించారు. పెద్ద పటం వేసి కల్యాణాన్ని నిర్వహించారు. అంతకుముందు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి



బొమ్మలరామారం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజా త్రివిక్రమ్

బొమ్మలరామారం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో రాజా త్రివిక్రమ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక కమిటీ సభ్యులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఎల్1 జాబితా ప్రకారం 2791 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, మొదటి విడత జాబితా ప్రకారం వీరిలో నిజమైన లబ్ధిదారులకు ఆయా గ్రామాల కమిటీ సభ్యులు ఈనెల 21వ తేదీ లోపు ఎంపిక జాబితా పూర్తి చేయాలని, 21వ తేదీ తర్వాత మండల స్థాయి అధికారులు కమిటీ సభ్యులు ఎంపిక చేసిన జాబితాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, మే 1, 2 తేదీల్లో గ్రామ పంచాయతీల్లో నోటీస్ బోర్డుపై లబ్ధిదారుల జాబితాను విడుదల చేస్తారన్నారు. మే 3, 4వ తేదీల్లో గ్రామ పంచాయతీ నోటీస్ బోర్డుపై ఉన్న జాబితాలపై ఎలాంటి అభ్యంతరాలు ఉంటే చెప్పాలన్నారు. మే 17 తర్వాత ప్రభుత్వం ఈ జాబితా ప్రకారం మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ పోస్టింగ్ ప్రారంభించే అవకాశం ఉందన్నారు. ఈ ఎంపిక విధానంలో పారదర్శకంగా నిర్వహించాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీవో శ్రీమాలిని, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలేరు : ప్రభుత్వ నిబంధనల మేరకే గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు గృహ నిర్మాణ కమిటీలు పని చేయాలని మండల ప్రత్యేక అధికారి గోపాల్ అన్నారు. గురువారం ఆలేరు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్య ఆంజనేయ ప్రసాద్, ఎంపీవో అనురాధ దేవి పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన అంతం కావాలి

(5వపేజీ తరువాయి)

పాదయాత్ర గురువారం సాయంత్రం మండలంలోని రాయిగిరికి చేరింది. ఈసందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నేత చింతల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్ రెడ్డి స్వాగతం పలికి రాయిగిరి నుంచి వడాయిగూడెం మీదుగా పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సందెల సుధాకర్, చిప్పలపల్లి మహేంద్ర, న్యాయవాది చామ రాజేందర్ రెడ్డి, కూతాడి సురేశ్, కృష్ణ పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: బీఆర్ఎస్ రజతోత్సవ సభతో ప్రభుత్వానికి వణుకు రానుందని ఆ పార్టీ రాష్ట్రనేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో వేములకొండ నుంచి యాదగిరిగుట్ట వరకు చేపట్టిన పాదయాత్రకు గురువారం భువనగిరిలో స్వాగతం పలికి మాట్లాడారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, నాయకులు సందెల సుధాకర్, సిహెచ్ మహేంద్ర, రాజేంద్రరెడ్డిపాల్గొన్నారు.

ఊపందుకున్న 'ఉపాధి' పనులు

(5వపేజీ తరువాయి)

ఊటచెరువులు, భూగర్భ అడ్డుకట్టలు, మట్టి ఆనకట్టలు, గ్రామాల్లో మొక్కలు నాటడం, చెక్‌డ్యాం నిర్మాణాలు, అడవుల పెంపకంతో కరువు నివారణ చర్యలు, గడ్డి భూమి అభివృద్ధి, రోడ్లు, కాల్వల పక్కన మొక్కల పెంపకం, బ్లాక్ మొక్కల పెంపకం సాగునీటి కాల్వలు, చిన్నతరహా సాగునీటి పనులు, పంట కాల్వల ప్రహరీల నిర్మాణం, చెరువుల పూడిక తీతతో పాటు సాంప్రదాయ నీటి వనరుల ఆధునికీకరణ పనులు, వరద నియంత్రణ, గ్రామీణ రహదారుల నిర్మాణం, మట్టి, మొరం రోడ్లు, మురుగు కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణాలు, గ్రామీణ పారిశుధ్య చర్యలు తదితర పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.